క్లుప్తంగా

మహిళ గొంతులో సూదిమొన తొలగింపు

నరసరావుపేట: గొంతులో ఇరుక్కున్న సూదిమొనను వైద్యులు చాకచక్యంగా తొలగించి ఓ మహిళను కాపాడిన ఉదంతమిది. ఈపూరు మండలం నల్లగొండ తండాకు చెందిన 38 ఏళ్ల సున్నావత్ లక్ష్మీభాయి భోజనం చేస్తూ సూదిమొనను కూడా మింగింది. అయితే అది గొంతులో ఇరుక్కుపోవటంతో తీవ్ర బాధకు గురైన ఆమెను బంధువులు పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లోగల శకుంతల నర్సింగ్‌హోంకు తీసుకొచ్చారు. డాక్టర్ ఐలా శ్రీనివాస్ ఎండోస్కోపీ ద్వారా సూది మొనను కనుగొని చాకచక్యంగా తొలగించారు. ఆమె భర్త, కుటుంబ సభ్యులు డాక్టర్‌కు కృతజ్ఞతలు తెలియచేశారు.

ముగ్గురు పేకాట రాయుళ్లు అరెస్టు

యడ్లపాడు: పంటపొలాల్లో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని లింగారావుపాలెం గ్రామ శివారున పొలాల్లో పేకాట ఆడుతున్నారంటూ అందిన సమాచారంతో ఎస్ఐ టి.శివరామకృష్ణ సిబ్బందితో స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న రూ.3700 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

కోడిపందెల ముఠా పట్టివేత

చిలకలూరిపేటటౌన్: కోడిపందెల నిర్వహణ స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని గోవిందాపురం గ్రామ పరిధిలో కోడిపందెలు నిర్వహిస్తున్నట్లు బుధవారం పోలీసులకు సమాచారం అందింది. దీంతో చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ జి.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కోడి పందేలను నిర్వహిస్తున్న ప్రాంతంపై మెరుపుదాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.8,500 నగదు, 3 కోడిపుంజులు (ఒకటి చనిపోయింది), 11 బైకులను స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వోకు గాయాలు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామ పంచాయతీ వీఆర్వో వీరవల్లి నాగ సంతోష లక్ష్మి విధులు ముగించుకొని తిరిగి బైకుపై వస్తుండగా రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. వివరాలు మేరకు ఈనెల 17న సాయంత్రం రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేసి రెవెన్యూ కార్యాలయానికి మరొకరి బైకుపై వస్తుండగా మార్గమధ్యంలో శావల్యాపురం జాతీయ రహదారి మార్గంలో బైకు అదుపు తప్పి పడిపోయింది. ఈప్రమాదంలో వీఆర్వో నాగలక్ష్మికి తలకు, భుజంపై బలమైన గాయాలైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు తహసీల్దారు యం.అర్జున్‌నాయక్ తెలిపారు. నరసరావుపేట ఆర్డీవో కె.మధులత వైద్యుడితో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. డిప్యూటీ తహసీల్దారు సుబ్బారావు, ఆర్ఐ చంద్రబాబు, వీఆర్వోలు ఉప్పుటూరి చిన మంగయ్య, మల్లెల రాధ, దూపాటి దేవమ్మ, తదితరులు ఉన్నారు.

పాఠశాలలో చేతి పంపు ఏర్పాటు



శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో 2001-02 పదోవ తరగతి పూర్వ విద్యార్థుల చేయూత ద్వారా చేతి పంపు ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి గురువారం తెలిపారు. పూర్వ విద్యార్థులు తమ వంతు సహాయంగా రూ.8 వేలు వితరణ చేసినట్లు తెలిపారు. చేతి పంపునకు అవసరమైన సామాగ్రి పాఠశాల నిధులను వెచ్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, చెరుకూరి హనుమంతరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

వి.రెడ్డిపాలెంలో పోషక మాసోత్సవాలు

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో గురువారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. పోషణ మాసోత్సవాల్లో ఊబకాయం గురించి వైద్యులు తెలియజేశారు. పంచదార వాడకం తగ్గించాలన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు చేయాలన్నారు. జంక్ ఫుడ్, తీపి పదార్థాలు, శీతలపానీయాలు ఇవ్వకూడదన్నారు. టీవీవి, మొబైల్‌లను పిల్లలకు దూరంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రేవతి, డాక్టర్ ప్రసన్న కుమార్, హెల్త్ సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

తిరుమల కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

నరసరావుపేట రూరల్: తిరుమల ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 11 మంది విద్యార్థులు హైద్రాబాద్‌లోని జేఎస్‌ట్రీ ల్యాబ్స్‌లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ గురువారం తెలిపారు. కళాశాలలో సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 200 మంది విద్యార్థులు పాల్గొనగా టెక్నికల్, హెచ్ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించి 11 మందిని ఎంపికచేసినట్టు పేర్కొన్నారు.ఎంపికైన వారిలో సీఎస్ఈ-11, ఐటీ-2, ఈసీఈ-1, ఏఐఎంఎల్-1 బ్రాంచీలకు చెందిన విద్యార్థులు ఉన్నారని వివరించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు రూ.3 లక్షల వార్షిక వేతనం లభిస్తుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, కార్యదర్శి రావెల సత్యనారాయణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం. సాంబశివరావు, అధ్యాపకులు అభినందించారు.

‘కొలువు’దీరిన దంపతులు

- డీఎస్సీలో టీజీటీలుగా ఒకేసారి ఎంపిక
- ఉద్యోగ సాధనలో అలుపెరగని పోరాటం

భార్యాభర్తల అనుబంధం కంటికి-చేతికీ ఉండే సంబంధంలా ఉండాలట. చేతికి దెబ్బ తగిలితే కన్ను తడవాలి. అదే కన్ను ఏడిస్తే చెయ్యి తుడవాలి. ఇది కొందరి విషయంలో అక్షర సత్యం అవుతుంది. ఎవరి జీవితంలోనైనా ప్రయత్నం చేయకుండా ఫలితం దక్కదు. ప్రశ్నించనిదే సమాధానమూ దొరకదు. ఇక అడుగు వేయనిదే కాలం కూడా కదలనివ్వదన్నట్లుగా చిలకలూరిపేటకు చెందిన ఈ దంపతులు చేసిన ఆలోచనలు - వేసిన అడుగులు ఇవాళ వారిని ఓ అద్భుత ప్రపంచానికి చేర్చాయి. వారి కలను సాకారం చేశాయి. లక్ష్య సాధనలో ఎన్ని అడ్డంకులు / ఆటంకాలు ఎదురైనా వాటిని పట్టించుకోకుండా.. ఆశించిన కొలువు దక్కించుకున్నారు. వారి వివరాలేమిటో ఓ మారు పరిశీలన చేస్తే...

చిలకలూరిపేటటౌన్ / యడ్లపాడు: చదువు, ఉద్యోగ సాధనకు సంసారం అడ్డుకాదని, ప్రేమ, సహకారం ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని నిరూపించారు చిలకలూరిపేట పట్టణానికి చెందిన బిరుదు స్పందన, ప్రియవర్థన్ దంపతులు. ఒకే కుటుంబంలో రెండు ఉద్యోగాలు అందులోనూ భార్యాభర్తలు ఇద్దరూ ఒకేసారి డీఎస్సీలో విజయం సాధించడం అంటే అరుదైన విషయం. అనేక అడ్డంకులను అధిగమించి, ఇద్దరూ ఒకేసారి డీఎస్సీలో టీజీటీలుగా ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించారు.

ప్రేమబంధానికి ఫలితం..

హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో చదువుకునే సమయంలో పరిచయమైన స్పందన, ప్రియవర్థన్ ఒకరినొకరు ప్రేమించుకున్నారు. పెద్దలను ఒప్పించి 2020లో కులాంతర వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత వీరికి ఒక కుమారుడు జన్మించాడు. తమిళనాడులోని ఒక ప్రైవేట్ కాలేజీలో ఫ్యాకల్టీలుగా పనిచేస్తున్న వీరు, డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి సొంతంగా సాధన చేశారు. ఒకరికొకరు సహకరించుకుంటూ గంటల తరబడి చదువుకోవడం, ఆన్‌లైన్లో శిక్షణ తీసుకోవడం తమ విజయానికి దోహదపడిందని చెబుతారు వారిద్దరు.

అవరోధాలు ఎదురైనా..

స్పందన తండ్రి శంకరయ్య నాదెండ్ల మండలం కనపర్రులో ఎస్జీటీగా పనిచేస్తున్నారు. తండ్రి స్ఫూర్తితో ఆమె ఈ లక్ష్యాన్ని ఎంచుకున్నారు. అయితే సీబీఎస్ఈ చదివినందున స్పందనకు స్కూల్ అసిస్టెంట్‌కు అర్హత నిరాకరించారు. అలాగే ఎమ్మెస్సీ తర్వాత హిందీ పండిట్ చేయడం వల్ల ‘బి’ గ్రేడ్‌స్టడీ అని చెప్పి హిందీకి కూడా అర్హత ఇవ్వలేదు. అయినప్పటికీ ఆమె నిరాశ చెందకుండా పట్టుదలతో చదివారు. భర్త ప్రియవర్థన్‌తో కలిసి ఒకరికొకరు తోడుగా నిలబడి, గంటల తరబడి సాధన చేశారు.

భార్యకు జోన్-3, భర్తకు జోన్-4..

వారి కృషి ఫలించి మొదటి ప్రయత్నంలోనే స్పందన బయాలజికల్ సైన్స్ టీజీటీగా, ప్రియవర్థన్ ఫిజికల్ సైన్స్ టీజీటీగా ఎంపికయ్యారు. ఈ విజయంతో స్పందనకు జోన్-3, ప్రియవర్థన్‌కు జోన్-4లోని గురుకుల పాఠశాలల్లో ఉద్యోగాలు లభించాయి. సంసారంలోనే కాదు, చదువులోనూ సహకరించుకుంటే ఎంతటి లక్ష్యాన్నైనా ఇట్టే సాధించవచ్చని నిరూపించిన ఈ దంపతులు అనేక మందికి స్ఫూర్తిగా నిలిచారు. వీరి విజయం పట్ల ఇరు కుటుంబాలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాయి.



ప్రియవర్థన్, స్పందన దంపతులు

నానో యూరియా ఎరువులు వినియోగించాలి

తహసీల్దారు నళిని



ఈపూరు (శావల్యాపురం): రైతులు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డీఏపీ ఎరువులను వినియోగించుకోవాలని తహసీల్దారు కె.నళిని అన్నారు. గురువారం ఈపూరు సొసైటీ పరిధిలో రైతులకు యూరియా సంచులు నిల్వలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రైతులు అవసరమైన మేరకు మాత్రమే యూరియా ఎరువును వాడాలన్నారు. అదే విధంగా రైతులెవరు అనవసరంగా అధిక మొత్తంలో యూరియా నిల్వలు ఉంచుకోవద్దన్నారు. ఆయనతో పాటు సొసైటీ చైర్మన్ విడపలపాటి హనుమయ్య, తిరుమలశెట్టి బాలయ్య, ఎస్సై యం.ఉమామహేశ్వర రావు, సీఈవో పోకా కోటేశ్వరరావు రైతులు ఉన్నారు.

రైతు సమస్యలు కూటమి గాలికొదిలేసింది

- అభివృద్ధి పక్కన పెట్టి రాక్షసపాలన సాగిస్తోంది
- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ : కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను గాలికి వదిలేసి అభివృద్ధిని పక్కన పెట్టి ప్రజల దృష్టిని మరల్చేందుకు రాక్షస పాలన కొనసాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బొల్లా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కి మంజూరు చేసిన 4.50లక్షల టన్నుల యూరియాని ముందుగానే 2.50 లక్షల టన్నులను బ్లాక్ మార్కెట్‌కు తరలించి టీడీపీ నాయకులు అమ్ముకున్నారని ఆరోపించారు. యూరియాతో పాటు డీఏపీ ఎరువులు కూడా బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారని దుయ్యబట్టారు.

పంటలకు గిట్టుబాటు ధరలేవి..

రైతులు పండించిన మిరప, ధాన్యం, కందులు, పొగాకు వంటి పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వలేని ప్రభుత్వం రైతుల పేరుతో వచ్చిన ఎరువులను అమ్ముకోవడం దారుణమన్నారు. టమోటా, ఉల్లి, మామిడి రైతులు కూడా ధర లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాల ద్వారా గిట్టుబాటు ధరలు కల్పించి సకాలంలో ఎరువులు అందజేశామని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు.

పేదలకు వైద్యం ఎక్కడ?

పేదలకు వైద్యం అందుబాటులో తెచ్చేందుకు వైఎస్సార్ సీపీ హయాంలో 17 మెడికల్ కాలేజీలను తీసుకొస్తే అందులో ఐదు మెడికల్ కళాశాలలు పూర్తిగా నిర్మాణాలు పూర్తయ్యాయని, ప్రస్తుతం ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. మీడియా గొంతు నొక్కుతూ సాక్షి ప్రసారాలపై నిషేధం విధించడాన్ని తప్పుబట్టారు. ఎవరైనా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే వారిని జైల్లో పెట్టి టీడీపీ నాయకులు ముందే పోలీసులు చేత కొట్టించి పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు.

మాజీ ఎమ్మెల్యే జీవీ అక్రమాలు

మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు షణ్ముఖ బయో ఫర్టిలైజర్స్ పేరుతో ఎరువుల కంపెనీలను స్థాపించి అవే ఎరువులను రైతులకు బలవంతంగా అంటగడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన యూరియా, డీఏపీ మార్కెట్‌లో అక్రమంగా అమ్ముకుంటూ తన బయో ఎరువులను 100 కోట్లకు పైగా వ్యాపారం చేసినట్లు ఆరోపించారు. ఇక పోలీసులు కూటమి ప్రభుత్వానికి ఏజెంట్లుగా పనిచేస్తూ శావల్యాపురం, ఈపూరు ఎస్ఐలు అక్రమ కేసులు పెట్టి వైఎస్సార్ సీపీ నాయకులను వేధిస్తున్నారని వారిపై చట్టపరంగా పోరాటం చేస్తామన్నారు.

వినుకొండలో అభివృద్ధి శూన్యం

వినుకొండలో తమ ప్రభుత్వ హయాంలో వంద పడకల ఆసుపత్రి, పాఠశాలల అదనపు గదుల నిర్మాణం, వినుకొండ కొండపై ఘాట్ రోడ్డు, మున్సిపల్ స్టేడియం వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మంత్రి హోదాలో ఉండి కనీసం ఆగిపోయిన పనులన్నీ చేయాలని సూచించారు. వినుకొండలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి మంగళగిరి, వినుకొండ ఎంపికయ్యాయని, మంగళగిరి ఆసుపత్రి నిర్మాణం పూర్తయిందని, నాబార్డు నిధులతో వినుకొండలో ఉన్న ఆసుపత్రి ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. రైతులకు ఇంత అన్యాయం జరుగుతున్నా ప్రశ్నిస్తానన్న పవన్‌కళ్యాణ్ ఎక్కడికి వెళ్లారని, కనీసం ఇప్పటికైనా ప్రశ్నించాలని సూచించారు. వినుకొండలో ఎక్కడపడితే అక్కడ ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలు ఆక్రమిస్తున్నారని, దీంతో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

‘రణభేరి’లో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు వెల్లడి



రణభేరిలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని యూటీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ టీఎస్ఎల్ఎన్ మల్లేశ్వరావు, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు హెచ్చరించారు. పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహనరావు ఆధ్వర్యంలో గురువారం చిలకలూరిపేట నుంచి ప్రారంభమైన రణభేరి ప్రచార యాత్ర నరసరావుపేట చేరుకుంది. స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మల్లేశ్వరావు, హనుమంతరావులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా విస్మరించడం సరికాదన్నారు. కూటమి పాలకులు చెప్పిన మాటలకు, చేష్టలకు ఎక్కడా పొంతన లేదన్నారు. గత ప్రభుత్వం కంటే వేగంగా విద్యారంగంలో సంస్కరణలు కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. యాప్‌లు రద్దు చేస్తామని చెప్పి అనేక యాప్‌లతో మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని, యాప్‌లు వలన విద్యార్థులకు ఏమి ఉపయోగమని ప్రశ్నించారు. ప్రభుత్వ విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు తగ్గిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డిమాండ్ల సాధనకు అన్ని ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. రణభేరి అనంతరం ఈనెల 25న గుంటూరులో జరగనున్న రాష్ట్ర చైతన్య సదస్సు, ఉపాధ్యాయుల భారీ ప్రదర్శన జయప్రదం చేయాలన్నారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు పి.ప్రేమ్ కుమార్, జిల్లా సహాధ్యక్షులు జేవీడీ నాయక్, ఎ.భాగేశ్వరీదేవి, మహిళా కార్యదర్శి ఉష సారీరాణి, జిల్లా కోశాధికారి రవిబాబు రణభేరి ఆవశ్యకతను వివరించారు. సమావేశంలో వివిధ పాఠశాలలో ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

పట్టపగలు బైక్ చోరీ



ద్విచక్రవాహనం వద్ద సంచరిస్తున్న అగంతకుడు

నరసరావుపేట టౌన్: నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతంలో ఇంటి ఎదుట పార్క్ చేసి ఉన్న వాహనాన్ని క్షణాల్లో అపహరించిన ఉదంతం వాహన యజమానులను కలవరపాటుకు గురిచేస్తుంది. గురువారం పట్టపగలు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో చోటు చేసుకున్న బైక్ చోరీ ఉదంతం వాహనాలకు రక్షణ కరువైందంటానికి నిదర్శనంగా నిలుస్తోంది. వివరాల్లో కెళ్లితే.. పాతూరులో నివాసం ఉండే షేక్ ఖాశిం ర్యాపిడో బైక్ ట్యాక్సీ నడుపుతూ జీవనం కొనసాగిస్తుంటాడు. గురువారం మధ్యాహ్నం తన ఇంటి ఎదుట ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆ సమయంలో అజ్ఞాత యువకుడు అక్కడికి వచ్చి అటు ఇటు కొద్ది సేపు తచ్చట్లాడాడు. జనసంచారం తక్కువగా ఉన్న సమయం చూసి మారుతాళాలతో ద్విచక్ర వాహనాన్ని చాకచక్యంగా స్టార్ట్ చేసి క్షణాల్లో దొంగిలించుకొని వెళ్లాడు. ఈ తంతంగం అంతా సమీపంలోని ఇంటి వద్ద ఉన్న సీసీ ఫుటేజీలో నిక్షిప్తమైంది. సీసీ ఫుటేజీని సేకరించిన వాహన యజమాని టూటౌన్ పోలీసులను ఆశ్రయించి వాహన చోరీపై ఫిర్యాదు చేశాడు. ఇది ఇలా ఉండగా పట్టణంలో కొన్ని నెలలుగా ద్విచక్ర వాహన చోరీలు అధికమయ్యాయి. రాత్రి ఇంటి ఎదుట నిలిపిన వాహనం తెల్లవారేటప్పటికి అపహరణకు గురికావటం పరిపాటిగా మారింది. దీంతో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలు, ఇళ్ల ఎదుట వాహనాలు నిలపాలంటే యజమానులు ఆందోళన చెందుతున్నారు.

వేర్వేరు క్రీడలకు పలువురు ఎంపిక



ఎంపికైన శారదా విద్యార్థులతో హెచ్ఎం రత్నజ్యోతి



విద్యార్థులను అభినందిస్తున్న వాగ్దేవి ప్రతినిధులు



లయోలా విద్యార్థులను అభినందిస్తున్న ఫాదర్స్



సంసిథ్ విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



ఎం.శివసాయి శ్రీకర్ (బాక్సింగ్)

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ బాలుర బాక్సింగ్ పోటీలకు శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి ఎం.శివసాయిశ్రీకర్ ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు గురువారం తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెయింటాన్స్ కళాశాలలో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 బాలుర బాక్సింగ్ పోటీలో శివసాయిశ్రీకర్ 64-69 కేజీల విభాగంలో ప్రథమస్థానంలో నిలచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీ లో శ్రీకర్ ఉమ్మడి గుంటూరు జిల్లాకు ప్రాతినిథ్యం వహిస్తాడని తెలిపారు. శ్రీకర్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్ష్య, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్త, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి తదితరులు అభినందించారు.



అథ్లెటిక్స్ మీట్‌కు వాగ్దేవి..

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్ మీట్‌కు వాగ్దేవి జూనియర్ కళాశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఓగూరి నాగేశ్వరరావు, పీడీ రాయల ఆంజనేయులు గురువారం తెలిపారు. గుంటూరుజిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 17వతేదీన నిర్వహించిన ఉమ్మడి గుంటూరుజిల్లా స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు బాల బాలికల విభాగంలో ప్రతిభ కనపరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. బాలికల విభాగంలో ఆవుల భూమిక (రన్నింగ్), పసుపులేటి తిరపతమ్మ, పిన్నెబోయిన స్రవంతి (షాట్‌పట్), బాలు ర విభాగంలో కొప్పుకొండ వెంకట వసంతచరణ్ (జావలిన్), బూదాల చైతన్య (హైజంప్), జి.శ్రీనివాస్ (రన్నింగ్), డి.త్రినాథ్ (షాట్‌పట్), ధర్మవరపు శివాజీ (రన్నింగ్) ఎంపికైనట్టు వివరించారు. ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు ఏలూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు ఉమ్మడి గుంటూరు జిల్లాకు ప్రాతినిథ్యం వహిస్తారని స్పష్టం చేశారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్రప్రసాదు, పాశం కృష్ణారావు, పి.వి.అచ్యుతరావు అభినందించారు.

వినుకొండ లయోలా విద్యార్థులు..

వినుకొండ: గుంటూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన అథ్లెటిక్స్ మీట్‌లో లయోలా విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ జ్ఞానదేవన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన కంచర్ల సాయి పెంట అథ్లెలిస్, లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, అండర్ -16లో 600 మీటర్స్‌లో తెల్లమేకల వెంకటశివప్రసాద్ 2వ స్థానం, 60 మీటర్స్‌లో భువనగిరి ఏడుకొండల సాయి 2వ స్థానంలో నిలిచారన్నారు. ఈ నెల 27 నుంచి 29 వరకు పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు పట్టణంలో జరిగే అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఫాదర్ అవినాష్, పాదర్స్ లియో, జోసఫ్, జాన్, వ్యాయామ ఉపాధ్యాయుడు బి.కొండలు పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో...

చిలకలూరిపేట టౌన్: జిల్లాస్థాయి ఘట్కా క్రీడా పోటీల్లో పట్టణానికి చెందిన శ్రీశారద జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటారు. ఈనెల 15న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పట్టణంలోని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో హైస్కూల్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థి యశ్వంత్, తొమ్మిదో తరగతి విద్యార్థులు ఇబ్రాయిల్, అరుణ, నాగచైతన్య ఘట్కా, సాఫ్ట్‌బాల్ ఆటల్లో విశేష ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ గౌరవాన్ని తెచ్చిపెట్టిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.రత్న జ్యోతి, పీఈటీ షేక్ ఖాసింబుడే, ఉపాధ్యాయులు పాదిలి వెంకటేశ్వర్లు, సుధారాణి అభినందించారు.

క్రీడలతో మానసిక వికాసం

శావల్యాపురం: విద్యతో పాటు క్రీల్లో రాణించటం ద్వారా శారీరక ధృడత్వానికి మానసిక వికాసానికి క్రీడాలు ఎంతో దోహదపడతాయని సంసిథ్ స్కూలు ప్రధానోపాధ్యాయులు సాగర్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని కనమర్లపూడి గ్రామ సమీపాన ఉన్న సంసిథ్ స్కూల్లో విద్యార్థులు క్రీడాల్లో మంచి ప్రతిభ చూపటంతో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 17న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో అండర్-14 విభాగంలో ఎస్.హంస వర్షిత లాంగ్ జంప్‌లో మొదట స్థానం, 600 మీటర్ల షార్ట్‌రన్ విభాగంలో రెండవస్థానం, 600 మీటర్ల రన్నింగ్‌లో తృతీయ స్థానం సాధించటం పాఠశాలకు తమ తల్లిదండ్రులు మంచి పేరు తేవటం అభినందనీయమన్నారు. అలాగే కె.నాసరయ్య షార్ట్‌పుట్‌లో ద్వితీయ స్థానం, 600 మీటర్ల రన్నింగ్‌లో 4వస్థానం సాధించినట్లు తెలిపారు. అండర్-14 విభాగంలో కె.వరుణ్ కార్తీక్ 60 మీటర్ల రన్ పోటీల్లో ప్రథమస్థానం, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం సాధించి క్రీడాల్లో తమ సత్తా చూపటం పలువురు విద్యార్థులకు ఆదర్శంగా ఉందన్నారు. ఆయనతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు కె. నాగరాజు ఉపాధ్యాయులు ఉన్నారు.

త్రోబాల్ పోటీలో...



విద్యార్థినులతో విద్యాసంఘం అధ్యక్ష, కార్యదర్శులు

చిలకలూరిపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించటం అభినందనీయమని చిలకలూరిపేట విద్యాసంఘం అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు చెప్పారు. స్కూల్ స్పోర్ట్స్ అసోసియేషన్ తెలంగాణా ఆధ్వర్యంలో ఈ నెల 13,14 తేదీలలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో బాలికల విభాగంలో త్రోబాల్‌లో ప్రథమ బహుమతి సాధించిన అండర్-14 ఏపీ జట్టుతో పాటు, ద్వితీయ స్థానం సాధించిన త్రోబాల్ అండర్-17 జట్టులో పట్టణానికి చెందిన ఆర్‌వీఎస్‌సీవీఎస్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ జట్టు విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ విద్యార్థినులకు గురువారం పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాసంఘం కార్యదర్శి ఎం.శివానంద కుమార్, స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ గౌసులాజం పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలి

వినుకొండ: తెలుగుసాహిత్యాన్ని సామాజిక చైతన్యం వైపు నడిపించిన విశ్వకవి గుర్రం జాషువా పేరును పల్నాడు జిల్లాకు పెట్టాలని గుర్రం జాషువా గుంటూరు, పల్నాడు జిల్లా సాధన సమితి కన్వీనర్ అట్లూరి విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాషువా ఒక ప్రాంతానికో, ఒక రాష్ట్రానికో పరిమితమైన కవి కాదని, దేశం గర్వించదగ్గర జాతీయ కవీశ్వరుడని అన్నారు.

● పరిశుభ్రత అందరి బాధ్యత

నూజెండ్ల: పరిశుభ్రత అనేది పౌరుల ఉమ్మడి బాధ్యత అని, విద్యార్థి దశ నుంచే పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో ఉమాదేవి అన్నారు. మండల కేంద్రంలోని పీఎంశ్రీ జెడ్పీ పాఠశాలలో స్వచ్ఛతా పట్వాడా కార్యక్రమం పై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు బి.శ్రీదేవి, సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, ఎస్ఎంసి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● రైతులకు సాంకేతిక సహకారం

నరసరావుపేట రూరల్: ఉద్యాన రైతులకు సాంకేతిక సహకారం అందించేందుకు ఫార్మర్ చాట్ అప్లికేషన్ ఉపయోగపడుతుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఐ.వెంకట్రావు తెలిపారు. ఉద్యాన శాఖ, డిజిటల్ గ్రీన్ ట్రస్ట్, మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యంతో అందుబాటులోకి తీసుకువచ్చిన ఫార్మర్ చాట్ మొబైల్ అప్లికేషన్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి వెంకట్రావు పాల్గొని వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధి మస్తాన్‌వలి, సిబ్బంది పాల్గొన్నారు.

● స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం

నూజెండ్ల: గ్రామాల్లో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణతోనే స్వచ్ఛ గ్రామాలుగా రూపుదిద్దుకుంటాయని ఎంపిడివో పి.ఉమాదేవి అన్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వతేదీ వరకూ మండలంలోని 27 పంచాయితీల్లో నిర్వహించటం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రమైన నూజండ్లలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో గురువారం ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, ఏపీయం ఆంజనేయరాజు, సాక్షరభారత్ మండల కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, పంచాయితీ సెక్రటరీ లాలు, లగడపాటి సూరిబాబు పాల్గొన్నారు.